పోలీసుల ముమ్మర తనిఖీలు

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు విశాఖలో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు. అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ సుబ్బారావు నగరంలోని సిబ్బందితో నగరాన్ని జల్లెడ పడుతున్నారు. విశాఖలో ఏర్పాటు చేసిన పోలీసులు చెకపోస్ట్లను అడవివరం, సరిపల్లి, అగనంపూడి, భీమిలి, చిన్నపురం లో స్థానిక ఎన్ఫోర్స్మెంట్ సీఐ లతో కలిసి వాహనాల తనిఖీలు చేశారు. గంజాయి, అక్రమ మద్యం, మాదక ద్రవ్యాల, నగదు అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరంగా దాడులు చేస్తున్నా మని సుబ్బారావు తెలిపారు. విశాఖపట్నం సెబ్ స్టేషన్ పరిధిలో గత వారం 50 కేసులు నమోదు చేసి వందల లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

అంతన్నారు..ఇంతన్నారు...!

ఇలా వచ్చి అలా టికెట్లు కొట్టేసారని
జనసేన కార్యకర్తల ఆవేదన
ఆ మూడు నియోజకవర్గాల్లో టీడీపీకి
పెనుముప్పే

నమ్ముకున్న వారిని నట్టేట ముంచేసిన టీడీపీ, జనసేన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఉమ్మడి విశాఖలో ముగ్గురు జనసేన అభ్యర్థులు ఇతర పార్టీల నుంచి ఇలా వచ్చి అలా టికెట్లు కొట్టేశారు. పార్టీకి ఏళ్ల తరబడి కష్టపడి పనిచేసిన వారిని పక్కనపెట్టి, పక్క పార్టీల నుండి వచ్చిన నెలల వ్యవధిలోనే వారికి అందలం ఎక్కించడంపై కార్యకర్తలు తీవ్రంగా మండిపడుతున్నారు. పదేళ్ళ నుంచి పార్టీనే నమ్ముకున్న వారిని నట్టేట ముంచడం పట్ల తీవ్ర విమర్శలు ఎదురౌతున్నాయి. అనకాపల్లి, విశాఖ దక్షిణం, పెందుర్తి స్థానాల్లో ధీటైన అభ్యర్థుల్ని జనసేన తయారు చేసుకోలేక పోయింది. పైగా టీడీపీ బలంగా వున్న స్థానాలను పొత్తులో భాగంగా జనసేన తన్నుకు పోయింది. ఎన్నాళ్ళగానో కష్టపడి పనిచేస్తూ వస్తున్న టీడీపీ అభ్యర్థుల భవిష్యత్ ఇప్పుడు అంధకారంలో పడింది. అనకాపల్లిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ మరోసారి పార్టీ టిక్కెట్ ఆశిస్తూ పార్టీ అభివృద్ధి కోసం తీవ్రంగానే పనిచేశారు. ఆఖరి నిమిషంలో కాంగ్రెస్, వైసీపీ, టీడీపీ పార్టీలన్నీ తిరిగి వచ్చిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జనసేనలో చేరిన నెల రోజుల్లోనే టిక్కెట్ పట్టుకెళ్ళిపోయారు. జనసేన పార్టీ కోసం కార్యాలయాన్ని ప్రారంభించి గత పదేళ్ళగా పని చేస్తున్న పరుచూరి భాస్కరరావు పరిస్థితి మరింత దయనీయం. జనసేన అధినేత పట్టించుకోకపోవడంపై కార్యకర్తలు ఆవేదన చెందారు. ఇక పెందుర్తి నియోజకవర్గంలో టీడీపీకి ఊహించని దెబ్బ ఎదురైంది. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి పార్టీ అభివృద్ధి కోసం, కార్యకర్తలకు అండగా నిలబడి పోరాటం చేశారు. చివరికి వైసీపీతో పోరాడి జైలుకు కూడా వెళ్లారు. అలాంటి బండారును కాదని ప్రజారాజ్యం, కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ పార్టీల్లో తిరిగి వచ్చిన మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు జనసేన పార్టీలో చేరిన మూడు నెలలకే టికెట్ కొట్టేశారు. దీంతో టీడీపీ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఒక సందర్భంలో బండారు పార్టీ విడిచి వెళ్ళిపోతారనే వార్తలు కూడా వచ్చాయి. మరో పక్క వైసీపీ నుంచి ఆహ్వానాలు వచ్చినా బండారు పార్టీలోనే కొనసాగడానికి నిర్ణయించుకున్నారు. టీడీపీ పరిస్థితి ఇలా వుంటే ఆఫీసరు ఉద్యోగాన్ని కూడా విడిచిపెట్టి జనసేనలో ఏళ్ళ తరబడి పని చేస్తున్న శివశంకర్‌కు ఆ పార్టీ టిక్కెట్ దక్కలేదు. దీంతో జనసేన పార్టీ శ్రేణుల్లో తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తమైంది. ఇక విశాఖ దక్షిణంలోనూ అదే జరిగింది. మాజీ శాసనసభ్యుడు గండి బాబ్జికి టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జిగా బాధ్యతలు అప్పగించారు. మూడేళ్ళ నుండి వార్డుల్లో తిరుగుతూ దక్షిణ నియోజకవర్గంలో టిడిపి క్యాడర్ ను కాపాడుకుంటూ, వాసుపల్లి వెంట వెళ్ళిపోకుండా పార్టీని బ్రతికించిన గండి బాబ్జికి టిడిపి అధినేత టికెట్ ఇవ్వకుండా గండి కొట్టారు. అకస్మాత్తుగా ప్రజారాజ్యం, వైసీపీ పార్టీల్లో తిరిగి వచ్చిన చెన్నుబోయిన వంశీకృష్ణ యాదవ్ జనసేన కోటాలో టిక్కెట్ కొట్టేశారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన గండి బాబ్జీ టీడీపీకి రాజీనామా చేశారు. గండి బాబ్జిని పక్కన పెట్టడం వల్ల తీవ్ర అసంతృప్తి రగులుతోంది. క్షేత్రస్థాయిలో పొత్తును అమలు చేయడంలో కార్యకర్తలు అంతగా ఆసక్తి చూపడం లేదు. స్వతహాగా బలంగా ఉన్న నియోజకవర్గాల్లో టిడిపి చేతులారా జనసేనకు అప్పగించడంపై తీవ్ర దుమారమే రేపుతుంది. పోనీ జనసేనలో తొలి నుండి ఉన్న నేతలకు టికెట్లు ఇవ్వకుండా ఆదరాబాదరాగా ఇటీవలే చేరిన వారికి టికెట్లు ఇవ్వడంపై కూడా ఆ పార్టీలో క్యాడర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తుంది. అందులో భాగంగానే దక్షిణ నియోజకవర్గంలో జనసేనలో రెండు వర్గాలుగా కుమ్ములాటలు తీవ్రస్థాయికి చేరాయి. ఎన్నికల్లో స్థానికతపై ఇరు పార్టీల్లో కార్యకర్తలు పెద్ద ఎత్తున నిలదీస్తున్నారు.

మహిళలు స్వయం ఉపాధి సాధించాలి

విశాలాంధ్ర - మల్కాపురం: మహిళలు చేతి వృత్తులకు ప్రాధాన్య తనిస్తూ స్వయం ఉపాధిని సాధించాలని, హస్త కళలను సజీవంగా పోషించాలని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి ఎ.సంధ్యారాణి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో ఇందిరా కాలనీ బర్మా కాలనీలలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరాలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ప్రతి మహిళ ఏదో ఒక వృత్తి నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని అన్నారు. అనంతరం కాగితాలతో పువ్వులను, బొకేలను తయారు చేయడంలో వాలంటీర్లకు, స్థానిక మహిళలకు శిక్షణ ఇచ్చారు. అంతా కలసి దాదాపు 200 పువ్వులను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో తయారు చేసిన బొకేలను, పువ్వులను స్థానిక పాఠశాలలో పంపిణీ చేశారు. అనంతరం ఆదర్శ గ్రామం అనే అంశం పై వలంటీర్లకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, నదియా, వై.అనసూయా దేవి పాల్గొన్నారు.

డైట్‌లో ప్రపంచ కవితా దినోత్సవం

విశాలాంధ్ర - భీమిలి: మదిలో భావాలకు అక్షర రూపం, మనసులో భావాలకు కళాత్మక రూపమే కవిత అని, అక్షరాసులు నిరక్షరాస్యులు కూడా తమ భావాలను మాటల రూపంలో వ్యక్తపరచవచ్చని డైట్ వైస్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు అన్నారు. డైట్లో గురువారం ప్రపంచ కవిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'సమాచార స్రవంతి' ఈ-మాస పత్రిక సంపాదకుడు గొట్టేటి రవి మాట్లాడుతూ బాధలోనూ, సంతోషంలోనూ, విరహంలోనూ, కోపంలోనూ పైకి చెప్పుకోలేని అనేక భావాలు మనసులో మెదలుతుంటాయని, వాటికి అక్షర రూపం ఇస్తే కవితగా మారుతుందని అన్నారు. ఈ సందర్భంగా చాత్రోపాధ్యాయులు వివిధ శీర్షికలతో అనేక కవితలు వినిపించారు. కవితా పఠనంలో పాల్గొన్న వారికి డైట్ తరపున పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చలర్లు ఎల్.సుధాకర్, జి.జి.ఎస్.నాగేశ్వరరావు, అధ్యాపకులు త్రినాధరావు, మాధవి, హరిణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సిందే: కలెక్టర్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఎన్నికల విధుల నుంచి ఎవరికీ మినిహాయింపు లేదని అన్ని శాఖల పరిధిలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది వివరాలను అత్యంత కచ్చితంగా జిల్లా యంత్రాంగానికి నివేదించాలని జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లిఖార్జున ఆయా శాఖల అధిపతులను ఆదేశించారు. అత్యవసర సేవల్లో నిమగ్నమయ్యే వారు తప్ప మిగిలిన వారందరూ ఎన్నికల విధుల్లో పాల్గొనాల్సిందేనని స్పష్టం చేశారు. పోల్ మేనేజ్మెంట్, సిబ్బంది కేటాయింపు ఇతర అంశాలపై చర్చించే నిమిత్తం గురువారం జిల్లాలోని అన్ని శాఖల అధిపతులతో కలెక్టరేట్ వీసీ హాలులో జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పలు అంశాలపై మార్గనిర్దేశకాలు జారీ చేశారు. ఆయా శాఖల పరిధిలో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది వివరాలను నిర్ణీత కాలంలోగా అందజేయాలని, ఇదివరకు ఇచ్చిన డేటాలో మార్పులు, చేర్పులు ఉంటే ముందుగా తెలియజేయాలని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, వీఎంఆర్డీఏ జేసీ, మానవ వనరుల కేటాయింపు నోడల్ అధికారి రవీంద్ర, వివిధ విభాగాల హెచ్.వో.డి.లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల కల సాకారమైన వేళ....

తాపీ మేస్త్రీ కుమార్తె ఎంబీబీఎస్ యూనివర్సిటీ టాపర్

విశాలాంధ్ర - పెందుర్తి: కోట్లాది రూపాయలు విరాళాలు ఇచ్చి, లక్షల రూపాయలు ఫీజులు చెల్లించి సకల సదుపాయాలు సమకూర్చినా కనీసం ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులు ఉన్న ఈ రోజుల్లో నిరుపేద తాపీ మేస్త్రి కూతురు మీసాల భూలక్ష్మి ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం యూనివర్సిటీ టాపర్‌గా నిలిచి తనకు తానే సాటిగా నిరూపించుకుంది. నీట్ ఎంట్రన్స్ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకు సాధించి ఫ్రీ సీటు సంపాదించుకున్న భూలక్ష్మి ఎంబిబిఎస్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తోంది. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం గొల్లపాలెం గ్రామానికి చెందిన మీసాల అప్పలనాయుడు, మీసాల రవణమ్మ దంపతులు, కొడుకు కూతురుతో కలిసి బ్రతుకుతెరువు కోసం 15 ఏళ్ల క్రితం విశాఖ జిల్లా పెందుర్తి మండలం సుజాతనగర్ శ్రామిక నగర్ వలస వచ్చి సాధారణ దిగువ మధ్యతరగతి జీవనం సాగిస్తున్నారు. అప్పలనాయుడు తాపీ మేస్త్రి పనులు చేస్తుండగా రమణమ్మ కూలీ పనులు చేస్తూ పిల్లలను పోషించుకుంటున్నారు. కాయ కష్టం చేసి పిల్లలను బాగా చదివించాలన్న తపనతో ఉన్న తల్లిదండ్రుల ఆశలకు ప్రభావితులైన భూలక్ష్మి ఆమె సోదరుడు చిన్ననాటి నుండి చదువులో అత్యుత్తమంగా సాగుతున్నారు. కుమారుడు ఇంజనీరింగ్ చదువుతుండగా కుమార్తె భూలక్ష్మి ఎంబిబిఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఇంటర్‌లో 98 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన భూలక్ష్మి ఎంబీబీఎస్ చేయాలని తపనపడేది. అయితే ఆర్థిక స్తోమత సరిపోక తల్లిదండ్రులు నిరాశకు గురైన సమయంలో తల్లిదండ్రులను ఒప్పించి నీట్ ఎంట్రన్స్ పరీక్ష రాసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అమలాపురం కిమ్స్ కళాశాలలో ఫ్రీ సీట్ సంపాదించింది. నాటినుండి ప్రతి సెమిస్టర్‌లోను ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ ప్రశంసలు పురస్కారాలు అందుకుంటోంది. తాజాగా ద్వితీయ సంవత్సరం ఎంబీబీఎస్‌లో కిమ్స్ కళాశాల టాపర్ గాను యూనివర్సిటీ స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. దీంతో కళాశాల, యూనివర్సిటీ యాజమాన్యాలు భూలక్ష్మిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. అలాగే ఇలాంటి చదువుల సరస్వతిని కన్న తల్లిదండ్రులను స్థానికంగా పలువురు అభినందించారు.

గుడ్ల పోలిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం

విశాలాంధ్ర - సాగర్‌నగర్: విశాఖపట్నం జీవీఎంసీ 8వ వార్డ్ పరిధిలో గల స్వర్ణ భారతి నగర్‌లో వార్డు అధ్యక్షులు గుడ్ల పోలిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీని గెలిపించాలని పోలమాంబ గుడి వద్ద కొబ్బరి కాయ కొట్టి మొదటి రోజు ఎన్నికలు ప్రచారం చేశారు. సుమారు 200 ఇళ్లకు తిరిగి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు చెన్నా దాసు, ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, చెన్నా ఎల్లయ్య, ముదుండి రాజేశ్వరి, దానయ్య, రాజు, ఎల్లాజీ, వాసు, పవన్, వాసు, భాస్కర్, కొర్లయ్య, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

గడపగడపకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించండి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను గడపగడపకు వెళ్లి విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం ఎండాడ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలే ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకువస్తాయని, చేసిన అభివృద్ధిని గడపగడపకు మరోసారి వివరించాలని తెలియజేశారు. టిడిపి జనసేన కూటమి పేరుతో రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేసేందుకు వస్తున్న తీరును ప్రజలకు వివరించాలని, మేము సిద్ధం మా బూత్ సిద్ధం అంటూ త్వరలో తమ అధినేత జగన్ రాష్ట్రమంతటా విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తారని అందుకు కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సన్నద్ధం కావాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో పోలింగ్ బూత్ స్థాయిలో ఓటర్లను రోజు కార్యకర్తలు కలిసి ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాస్, వాసుపల్లి గణేష్ కుమార్ తోపాటు నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటు యువత చేతిలో ఏకైక ఆయుధం

గీతం అధ్యక్షుడు శ్రీభరత్

విశాలాంధ్ర - మధురవాడ: యువతరం తమ భవిష్యత్తును, దేశ ప్రగతికి సంబంధించిన ఆకాంక్షలను నిర్దేశించాలంటే ఓటు హక్కును ఉపయోగించుకోవాలని ముఖ్యంగా ఓటు అనే ఆయుధాన్ని బాధ్యతతో రానున్న ఎన్నికలలో ఓటింగ్‌లో పాల్గొనడం ద్వారా వినియోగించు కోవాలని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ పిలుపునిచ్చారు. భారత పరిశ్రమల సమాఖ్య అనుబంధ విభాగం యంగ్ ఇండియన్స్ గురువారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యువ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. 18 సంవత్సరాలు పూర్తి చేసిన ప్రతి ఒక్కరు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని, విధిగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఆయన సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరుగా యువత తమ వంతు బాధ్యతను గుర్తెరిగి తమ ఆకాంక్షలను నెరవేర్చే నాయకులను అధికారంలోకి తీసుకురావచ్చునని ఆయన పేర్కొన్నారు. వివిధ కారణాలను చూపి ఓటు హక్కును వినియోగించుకోకపోవడం, ఓటింగ్‌కు దూరంగా ఉండటం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్రంలో, కేంద్రంలో చట్ట సభలు వాటికి గల అధికారాలను కొత్త ఓటర్లకు వివరించారు. ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అధికారులు వందలాది కిలోమీటర్లు ప్రయాణించి ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలింగ్ బూత్‌లలో ఉంటున్నారని పక్కనే ఉండే వారికి మాత్రం ఓటు వేసే తీరిక లేకపోవడం విచారకరం అన్నారు. రానున్న సంవత్సరాలలో తమ భవిష్యత్తును ఎలా నడిపించాలో యువతరం నిర్దేశించాలని, అందుకు ఓటరుగా నమోదు చేసుకొని రాజ్యాంగం కల్పించిన హక్కును ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిఐఐ యంగ్ ఇండియన్స్ ప్రతినిధులు సంజన, సుమీథ్, నివేదిత, ఆదర్శ్, రోహిత్, గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా
పలువురికి గాయాలు

విశాలాంధ్ర - ఆనందపురం: మండలం శొంఠ్యం గ్రామం నేషనల్ హైవే ఎస్ ఎస్ఆర్ఐటీ వద్ద గురువారం పెళ్లి కారు బోల్తా పడింది. పలువురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పెళ్లి కోసం పెళ్లికూతురుతో కలిసి విజయవాడ నుంచి శ్రీకాకుళం జిల్లా వీరఘట్టం లావేరు మండలం వెళుతున్న కారు శొంఠ్యం వద్దకు చేరుకునే సరికి కారు అదుపుతప్పింది. దీంతో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారులో ఉన్న పెళ్లి కూతురుకి, ఇద్దరు మహిళలకు, డ్రైవర్, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురు చిన్నారులు కూడా ఉన్నారని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని క్షతగాత్రులను స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో సంగివలసలో ఉన్న ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. ఎవరికి ఎటువంటి ప్రాణహాని లేదని కేసు దర్యాప్తులో పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని ఆనందపురం పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే అదీప్ రాజ్‌కు ముడుపులు...అడ్డగోలుగా రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర - పెందుర్తి: స్థానిక ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్‌కు డబ్బు చెల్లించడంతో చట్టానికి తూట్లు పొడిచి, నిబంధనలకు నీళ్లు వదిలి వైసిపి నాయకుడు, విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్థలంలోకి జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, అడ్డగోలుగా రోడ్డు నిర్మిస్తున్నారని జనసేన నాయకుడు గళ్ళ శ్రీనివాస రావు ఆరోపించారు. మండలంలోని నరవ గ్రామంలో గల ఎంఈసి వర్క్స్ నుండి వాసుపల్లి గణేష్ కుమార్ స్థలంలోకి 1.9 కోట్ల జీవీఎంసీ నిధులతో ఆదరాబాదరాగా రోడ్డు నిర్మిస్తున్నారని ఆయన విమర్శించారు. గతంలో జీవీఎంసీ కౌన్సిల్లో సభ్యుల ందరూ ఏకగ్రీవంగా ఈ పనులను అడ్డుకోవడంతో కొన్నాళ్లపాటు నిలిపేసారని, ఇప్పుడు అకస్మాత్తుగా పనులు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని ఎంఈఎస్ రోడ్డులో జీవీఎంసీ అధికారులు పనులు ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి పనులు ప్రారంభించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దీనిపై జనసేన పార్టీ తుది వరకు పోరాడుతుందని హెచ్చరించారు.

వైభవంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి స్వర్ణ తులసీ దళార్చన, నిత్య కళ్యాణం తదితర ఆర్జిత సేవలు నయనానందంగా జరిగాయి. వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో వైభవోపేతంగా జరిగాయి. ఏకాదశి పర్వదినం న స్వామివారి స్వర్ణ తులసి దళ అర్చన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైన్నారు అర్చక స్వాములు అత్యంత వైభవంగా, సింహాచల పుణ్య క్షేత్రములో దేవస్థాన వేదపండితుల వేదమంత్రాల, నాదస్వర మంగళ వాయిద్యాలతో శాస్త్రోక్తంగా స్వర్ణ తులసి దళాల తో స్వామివారి అర్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. పిదప ఆర్జిత సేవల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండ పంలో అధిష్ఠింపజేశారు. పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సే నారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఎన్నికల కోడ్ ఉన్నా తీరు మారదా....?

వైసీపీ రంగులతో దర్శనమిస్తున్న వాటర్ ట్యాంక్ పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి

విశాలాంధ్ర - ఆనందపురం: ప్రచార యావతో గత ఐదేళ్ల కాలం నుంచి ఎక్కడపడితే అక్కడ రంగులేసి చివరికి వాటర్ ట్యాంకులను కూడా వదిలిపెట్టలేదు. సార్వత్రిక ఎన్నికల ప్రకటన నేపథ్యంలో ఎన్నికల అధికారులు అప్రమత్తమై రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తీసేసి విగ్రహాలు ఉన్నచోట ముసుగులు వేస్తున్నారు. ప్రైవేటు ప్రభుత్వ ప్రాంగణాల్లో రాజకీయ రంగులతో ఎటువంటి చిత్రాలు ఉండకూడదని ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ కూడా ఇంకా కొన్నిచోట్ల దర్శనమిస్తున్నాయి. మండలంలో వేములవలస పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ పువ్వుల మార్కెట్ వద్ద ఉన్న నీళ్ల ట్యాంకు వైసీపీ రంగులతో దర్శనమిస్తుంది. ఎలక్షన్ నియమ నిబంధనలు తుంగలో తొక్కారని సదరు స్థానిక పంచాయతీ కార్యదర్శి నిబంధనలు పాటించలేదని స్థానిక ప్రజలు సి విజిల్ యాప్‌లో ఎలక్షన్ కమిషన్‌కు కంప్లైంట్ ఇచ్చిన ఫలితం రాలేదని వాపోతున్నారు. ఈసీ ఆదేశాలు ఉన్నప్పటికి కోడ్ నేపథ్యంలో కొన్నిచోట్ల ఇలాంటివి దర్శనమిస్తున్నాయి.

కొద్దిపాటి జీతాల్లో కోతలా...!

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానం సెక్యూరిటీ గార్డుల జేబుకు చిల్లులు పడున్నాయి. కాపలాదారులూ లేదా సెక్యూరిటీ గార్డులు వ్యక్తులకి, సంస్థలకి రక్షణ కలిగిస్తారు. అటువంటి సెక్యూరిటీ గార్డుల సరఫరా గుత్తేదారు మారినప్పుడల్లా సెక్యూరిటీ డ్రెస్ పేరుతో నెలకు వెయ్యి రూపాయిల కటింగ్‌గా మూడు నెలల పాటు ఇస్తున్న కొద్దిపాటి జీతంలో కటింగ్ చేస్తే ఈరోజుల్లో ఎలా బతుకుతామని అంటున్నారు. సెక్యూరిటీ గార్డుల నెలసరి జీతం సెక్యూరిటీ గార్డులు అష్టకష్టాలు పడుతున్నారు. పనికి తగ్గ వేత నాలు ఇవ్వకుండా, ఇస్తున్న వేతనాల్లో కూడా అధికారులు చేతి వాటంతో కోత విధిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. పని చేసే చోట కనీస సౌకర్యాలు లేకపోవడంతో సెక్యూరిటీ గార్డులు నానా ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం 100 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ఇచ్చే వేతనాలు అరకొరగా ఉన్నాయి. తమకు ఆయా సంస్థలు ఇచ్చే వేతనం తక్కువ. దీనికి తోడు సంస్థ మారినప్పుడల్లా తమకు బూట్లు, బట్టలు ఇస్తే నెలకు రూ. 1,000/- చొప్పున 4 నెలలు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. సంబంధించిన ఫీల్డ్ ఆఫీసర్ చేతివాటం ప్రదర్శించడంతో తమకు వేతనాల్లో కోత పడుతోందని ఆరోపించారు. ఈ విషయంలో పై అధికారులు చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని బాధిత సెక్యూరిటీ గార్డులు కోరుతున్నారు.

గ్రామాల్లో ముత్తంశెట్టి ప్రచారం

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండల పరిషత్ అధ్యక్షులు కంటుభోతు రాంబాబు ఆధ్వర్యంలో అనంతవరం పంచాయతీ పెంట గ్రామాల్లో ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వాల పాలనకు వైసిపి ప్రభుత్వంలో జగనన్న అందించిన పాలనకు మధ్య వ్యత్యాసం ప్రజలందరికీ తెలుసునని అన్నారు. ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా జగన్ హయాంలో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. భీమిలీలో ఫ్యాన్ గుర్తుపై ఓటేసి మూడోసారి ముచ్చటగా గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచార సభలో పద్మనాభం మండల వైసిపి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర విశాఖపట్నం
పేజి : 2
శుక్రవారం 22, మార్చి, 2024

బీజేపీ రామునాయుడు వైపు ప్రధాన పార్టీల చూపు

విశాలాంధ్ర - పెందుర్తి: రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవర్గాల్లో ఒకటిగా నిలిచే ఉమ్మడి విశాఖ జిల్లా పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయాలు క్షణానికో విధంగా మారి పోతున్నాయి. మిత్రులు శత్రువులుగాను, శత్రువులు మిత్రులుగాను అవతరిస్తున్నారు. వచ్చే ఎన్నికలు అన్ని పార్టీలకు అతి ముఖ్యం కావడంతో ప్రత్యర్థి పార్టీల్లోని బలమైన నాయకులను ప్రసన్నం చేసుకోవడానికి ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయి. ఈ క్రమంలో అటు సామాజిక వర్గ పరంగాను ఇటు ఆర్థికంగానూ బలమైన నేతగా ఎదిగిన బిజెపి కన్వీనర్ గొర్లె రామునాయుడిని తమ పార్టీలలో చేర్చుకునేందుకు ఆయా పార్టీల ముఖ్య నేతలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. విద్యాసంస్థల అధినేత, సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే గొర్లె రామునాయుడు గత కొన్నేళ్లుగా పెందుర్తి నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ పురోగతికి విశేష కృషి చేస్తూ వచ్చారు. గత జీవీఎంసీ ఎన్నికల్లో పార్టీ తరఫున కార్పొరేటర్‌గా పోటీ చేసిన రామునాయుడు తక్కువ కాలంలోనే మంచి ఫలితాలు సాధించారు. పార్టీలో సామాన్య కార్యకర్తగా చేరి, పార్టీ కోసం అహర్నిశలు పాటుపడుతూ మండల పార్టీ అధ్యక్షుడు, పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, అనకాపల్లి జిల్లా కార్యదర్శి స్థాయి వరకు ఎదిగారు. బిజెపి తరఫున పెందుర్తి శాసనసభ్యుడుగా పోటీ చేసే ఆలోచనతో పార్టీ గుర్తును, సిద్ధాంతాలను ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి నియోజకవర్గ స్థాయిలో గ్రామ, గ్రామానికి తీసుకువెళ్లారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా రాత్రి-పగలు పార్టీ కోసం పని చేశారు. అయితే బిజెపి-టిడిపి-జనసేన పార్టీల పొత్తులో భాగంగా పెందుర్తి సీటు జనసేనకు దక్కడంతో రాము నాయుడు ఆశలపై నీళ్లు చల్లినట్లు అయింది. మరోవైపు 2024 ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీల నాయకులు బలమైన క్యాడర్ కలిగిన రామునాయుడును తమ వైపు ఆకర్షించగలిగితే గెలుపు సునాయాస మవుతుందన్న భావనతో అడుగులేస్తున్నారు. ఆయా పార్టీలకు చెందిన కీలక నేతలు కొందరు రామునాయుడితో ఫోన్లో మాట్లాడి, పదవులు, డబ్బు ఆశ చూపి వారి పార్టీలోకి ఆహ్వానించినట్టు తెలిసింది. అయితే రామునాయుడు వారికి ఎలాంటి భరోసా ఇవ్వలేనట్లు సమాచారం.

గీతంలో సాంకేతిక యువజనోత్సవం ప్రారంభం

విశాలాంధ్ర - మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం (ఇఇసిఇ) ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజనీర్స్ (ఐఇటిఇ) సంయుక్త నిర్వహణలో జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐ స్వేర్ ఆర్-2024 గురువారం ప్రారంభమైంది. ప్రముఖ సైటిస్ట్-ఎఫ్ ఎన్ఎస్‌టిఎల్ వివేక్‌శర్మ ముఖ్యఅతిథిగా హజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులు సమకాలీన సాంకేతిక మార్పులపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్ర మంలో ఎమ్.రాఘవచేతన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్, ఇఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణిచంద్రకుమార్, ఐ స్వేర్ ఆర్ కన్వీనర్ సెవెన్త్ లైన్, ఫ్యాకల్టీ సలహదారులు డాక్టర్ పి.రాజు, ఎన్.వి.ఎస్.వి. విజయకుమార్, డాక్టర్ ఎస్.శారదరాణి తదితరులు పాల్గొన్నారు. సాంకేతిక యువజనోత్సవంలో భాగంగా విద్యార్థులు రూపొందించిన పలు ఇంజనీరింగ్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. నూతన సాంకేతక అంశాలపై వర్క్‌షాప్‌లతో పాటు నిపుణుల ప్రసంగాలు, పేపర్ ప్రెజింటేషన్, టెక్‌ఎక్స్‌పో, ఆర్ట్‌ఎక్స్‌పో, రోబోరేస్ నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కోఆర్డినేటర్లు తెలిపారు.

ఈఎస్‌ఏఎఫ్‌ఎస్‌ఎఫ్ బ్యాంక్ కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఎంఓయు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఈరోజు కార్పొరేట్ ఏజెన్సీ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం ద్వారా వినియోగదారులకు విస్తృత శ్రేణిలో ఆర్థిక పరిష్కారాలను అందించాలనే లక్ష్యం దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు వేశాయి. ఈ ఒప్పందం, తమ ఉత్పత్తి శ్రేణిని విస్తరించడానికి , బ్యాంకింగ్ లేని తగినంతగా బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని వారికి ఆర్థిక స్థిరత్వాన్ని నిర్ధారించాలనే నిబద్ధతను ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ నొక్కి చెబుతుందనీ ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎండి కె. పాల్ థామస్ కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ ఎండి అనూజ్ గులాటి అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా, ఈఎస్ఏఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ యొక్క ప్రత్యేకమైన వినూత్నమైన ఆరోగ్య బీమా పరిష్కారాలను తమ విస్తృత కస్టమర్ నెట్‌వర్క్‌కు అందుబాటులోకి తీసుకువస్తుందన్నారు.

ముంబయిలో జాయ్ టౌన్ రెండవ ఎడిషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్న బిఎండబ్ల్యూ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: బి ఎం డబ్ల్యూ గ్రూప్ ఇండియా తన మ్యూజిక్ అండ్ డ్రైవింగ్ ఫెస్టివల్ - జాయ్ టౌన్ రెండవ ఎడిషన్‌ను అందుబాటులోకి తీసుకు వస్తోంది. ముంబయిలోని బ్రాండ్ అభిమానులను ఔత్సాహికులకు రెండు రోజుల పాటు లీనమయ్యే బ్రాండ్ అనుభవ ఉత్సవాన్ని 12-13 ఏప్రిల్ 2024న ముంబయిలోని మహాలక్ష్మి రేస్‌కోర్స్‌లో నిర్వహించనున్నారు. జాయ్ టౌన్‌లో భాగంగా బిఎం డబ్ల్యూ, మినీ బిఎండబ్ల్యూ మోటోరాడ్ కార్లు బైక్‌లు, సంగీతం, వినోదం గాస్ట్రోనమికల్ డిలైట్‌ల కచ్చితమైన మిక్స్‌గా ఒక వినూత్నమైన అనుభవాన్ని అందిస్తుంది. ఎక్స్‌పర్ట్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా రూపొందించిన ట్రాక్‌లో బి ఎం డబ్ల్యూ ఎక్స్ డ్రైవ్ శక్తి, చురుకుదనం మరియు పరాక్రమాల ప్రదర్శన ఉంటుందని, బిఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా అధ్యక్షులు విక్రమ్ పవాహ్ అన్నారు.

ఇచ్చిన అప్పులు వసూలు చేసుకోలేక మహిళ ఆత్మహత్య

విశాలాంధ్ర - పెందుర్తి: జీవీఎంసీ 94వ వార్డు వేపగుంటలో విషాదం చోటుచేసుకుంది. బుధవారం రాత్రి గంగ్రెడ్డి సత్య శాంతి (35) బలవన్మరణానికి పాలుపడిన ఘటన కలకలం రేపింది. తెలిసిన వ్యక్తికి మాటే సాక్ష్యంగా 50 లక్షలు రూపాయలు పైచిలుకు అప్పుగా ఇచ్చిన సత్య శాంతి ఆ మొత్తాన్ని వసూలు చేసుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆమె కుటుంబీకులు వాపోతున్నారు. తాను ఇచ్చిన డబ్బులు గురించి పలుమార్లు అడుగుతున్నప్పటికీ అప్పు తీసుకున్న వ్యక్తి చెల్లించకుండా మొహం చాటేసి తిరుగుతు కాలయాపన చేయడంతో ఒత్తిడి భరించలేక ఆవేదనతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి కాల్ లిస్ట్ ఆధారంగా ఒకరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. సత్య శాంతి కుటుంబానికి న్యాయం చేయా లంటూ స్థానికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అత్యాధునిక సదుపాయాలతో వీరమ్ బ్లాక్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: అత్యాధునిక సదుపాయాలతో కూడిన పురుషుల వీరమ్ సతి బ్లాక్‌ను చీఫ్ నేవల్ స్టాఫ్ హరికుమార్ ప్రారంభించారు. నౌశక్తి నగర్‌లో దీనిని ప్రారంభించారు. వీరమ్ బ్లాక్ బయోగ్యాస్ ప్లాంట్‌తో కూడిన కుక్ హౌస్, పూర్తి సన్నద్ధమైన వ్యాయామశాల, వినోద సౌకర్యాలు సమగ్ర లైబ్రరీ వంటి సమకాలీన సౌకర్యాలతో ఏర్పాటు చేశారు.

గంజాయి కేసు దర్యాప్తు చేస్తున్నాం

విశాలాంధ్ర-గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 89వ వార్డ్ కొత్తపాలెం లో ఇటీవల పోలీస్ వారు పట్టుకున్న 110 కేజీల గంజాయి వివరాలను నగర డిసిపి సత్యబాబు గోపాలపట్నం పోలీస్ స్టేషన్ లో తెలిపారు. పోలీస్ వారు తెలిపిన వివరాల ప్రకారం విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుండి గంజాయిని కొనుగోలు చేసి గోపాలపట్నం, కొత్తపాలెం లో ఓ టిఫెన్ దుకాణం లో స్టాక్ పెట్టేందుకు ప్రయత్నిస్తుడంగా పక్క సంచారంతో పోలీస్ వారు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పిదప పోలీస్ వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తులో 5గురు ముద్దయిలను అదుపులోనికి తీసుకుని విచారించగా వారు ఇచ్చిన సమాచారం ప్రకారం ఒక కారు, ఒక ఆటో, మూడు ద్విచక్ర వాహనాలతో పాటు 5 సెల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన ఆరుగురు నిందుతులకోసం మా ప్రత్యేక బృందం గాలిస్తున్నారు అని డిసిపి తెలిపారు.

25 నుంచి బుల్లితెరపై మైత్రీ మూవీ మేకర్స్ మా అన్నయ్య

విశాలాంధ్ర - విశాఖపట్నం: అనూహ్యమైన కథతో రానున్న' మా అన్నయ్య' మార్చి 25న ప్రారంభం, సోమవారం నుంచి శనివారంవరకు ప్రతిరోజు సాయంత్రం 6:30గంటలకు, జీజి తెలుగులో ప్రసారం కానున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మా అన్నయ్య సీరియల్ కథగంగాధర్ జీవితం చుట్టూ తిరుగుతుందన్నారు. ప్రముఖ నటుడు గోకుల్ మీనన్ గంగాధర్ పాత్రలో కనిపించనున్నారని, రాధమ్మ కూతురులో అరవింద్ పాత్రను పోషించడం ద్వారా విజయవంతంగా తన స్టార్ పవర్ ని స్థాపించుకున్నారనన్నారు. ఈ షో గ్రాండ్ లాంచ్, దాని కథాంశం గురించి జీ తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ అనురాధ గూడూరు మాట్లాడుతూ జీ తెలుగు ప్రేక్షకులను అలరించే లక్ష్యంతో మరొక విలక్షణమైన కథను తీసుకురావడం మాకు సంతోషంగా ఉందన్నారు. గోకుల్ మీనన్ మాట్లాడుతూ 'జీ తెలుగులో నేను నటిస్తున్న రెండోసీరియల్ ఇది మా అన్నయ్య కథ చాలా ఆసక్తికరంగా ఉందన్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాతలు మాట్లా డుతూ వెండితెరపైనే కాకుండా బుల్లితెర ప్రేక్షకులకూ వినోదం పంచడంలో భాగమవుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు.

బయోటెక్నాలజీలో తాతా సందీప్‌కు ఏయూ డాక్టరేట్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం పరిశోధక విద్యార్థి తాతా శ్రీనివాస రమా సత్య సందీప్‌కి ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టరేట్ లభించింది. జెనెటిక్స్ విభాగ ఆచార్యులు, ప్రస్తుత ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పర్యవేక్షణలో ఫిజియోలాజికల్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ డ్రాట్ స్ట్రెస్ రిలేటెడ్ ట్రాన్స్‌క్రిప్షన్ ఫ్యాక్టర్స్ అండ్ ఇన్ సిలికో ఎనాలసిస్ ఫర్ క్రిస్పర్ క్యాస్ మీడియేటెడ్ జీనోమ్ ఎడిటింగ్ ఇన్ రైస్ అనే అంశంపై జరిపిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. బుధవారం ఏ.యు వి.సి ఆచార్య పీవి జి డి ప్రసాద్ రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను సందీప్ స్వీకరించారు. తన పరిశోధనలో భాగంగా నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో వరి సాగులో మొక్కలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటూ, ఏ విధంగా ప్రతిస్పందిస్తున్నాయి మరియు జన్యువుల ప్రభావం ఏమిటి అనే అంశంపై పరిశోధన జరిపారు. ఈ సందర్భంగా సందీప్ ని విభాగ ఆచార్యులు పరిశోధకులు అభినందించారు.

ఐఎన్ఎస్ సుమిత్రకు అభినందన



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఐఎన్ఎస్ సుమిత్ర, సెంట్రల్ అరేబియా సముద్రంలో యాంటీ పైరసీ కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహించి, 11 మంది సోమాలి పైరేట్స్‌ను పట్టుకుని, 17 మంది ఇరాన్ 19 మంది పాకిస్థానీ పౌరులను హైజాక్ చేసిన ఫిషింగ్ వెసెల్స్ నుండి రక్షించినందుకు హరి కుమార్ స్పాట్ యూనిట్ సైటేషన్‌ను అందుకున్నారు. ఓడ దాని సమగ్ర అగ్నిమాపక శక్తి, స్వదేశీ హెలికాప్టర్, ఇండియన్ నేవీ యొక్క ప్రత్యేక ఆప్స్ బృందాన్ని ఉపయోగించి కార్యకలాపాలను వేగంగా చేపట్టింది.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు: సీపీ

విశాలాంధ్ర - విశాఖ క్రైం: అన్ని రాజకీయ పార్టీలు ప్రచారం, ర్యాలీ, సభలు నిర్వహించాలంటే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యనార్ స్పష్టం చేశారు. గురువారం మధ్యాహ్నం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ మాట్లాడుతూ ర్యాలీ మీటింగ్ ప్రచారం వీటికి రిటర్నింగ్ ఆఫీసర్ మాత్రమే అనుమతి ఇస్తారని, సువిధ యాప్ ద్వారా అనుమతి తీసుకోవచ్చన్నారు. యాప్ పనిచేయని పక్షంలో సంబంధిత పోలీస్ స్టేషన్‌లో తెలపాలన్నారు. వీటిపై రిటర్నింగ్ ఆఫీసర్ పరిశీలించి అనుమతిని, పోలీసులు ఎన్ఓసి ఇస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నియోజక వర్గంలో మూడు ఎస్‌సీసీ టీంలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎవరైనా వయలేషన్‌కు పాల్పడితే సీ విజిల్ యాప్‌లో పబ్లిక్, రిపోర్ట్ చేయవచ్చన్నారు. డయల్ 100, 112 ఫిర్యాదులు ఎస్‌సీసీ టీమ్‌కి వెళ్తాయన్నారు. ఎస్సిసి టీమ్‌తో వీడియో గ్రాఫర్, ఒక పోలీస్ అధికారి ఉంటారని చెప్పారు. ఫీల్డ్‌లోని ఎస్సి సి టీములోని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, వచ్చిన ఫిర్యాదులను వెరిఫై చేసి తమకు పంపిస్తారని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఎస్సిసి లోని హెడ్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామన్నారు. రౌడీ షీటర్లు పాత నేరస్తులపై నిగా పెట్టామని, అలాగే పోలింగ్ బూత్ కు 200 మీటర్ల దూరంలో పార్టీ ప్రచార కార్యాలయాలు పెట్టుకోవచ్చన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ లో ఎఫ్ ఎస్ టి. ఎస్ ఎఫ్ టి ఉంటాయని, ముగ్గురు సాయుధ పోలీసులు ఉంటారన్నారు. ఎన్నికల్లో నగదు పంపిణీ వంటివి పోలీసులు పట్టుకోవడం సీజ్ చేయడం వంటివి ఇకపై ఉండవని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ అద్వర్యం లో మాత్రమె సీజ్ చేస్తారని తెలిపారు. సిఐఎస్ఎఫ్ ఆర్పిఎఫ్ బలగాలు కేంద్రం నుండి విశాఖకు వచ్చాయన్నారు. ఎలక్షన్ ఎక్స్పెండబరీ మానిటర్ సెల్ ఎవరెంత ఖర్చు పెడుతున్నారు అన్నది కౌంట్ చేస్తారన్నారు. సోషల్ మీడియాలో టీవీల్లో ఏదైనా వయలెసన్ దృశ్యాలు ప్రచారం అయితే వాటిని ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ పరిశీలించి తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని వివరించారు. సమావేశంలో జాయింట్ సీపీ ఫకీరప్ప, డీసీపీలు ఎం.సత్తిబాబు, సిహెచ్ మణికంఠ పాల్గొన్నారు.

టికెట్లు దక్కని వారికి బుజ్జగించే పదవులు

వైసిపి నియోజకవర్గ పరిశీలకులు నియామకం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్ఠంగా నడిపేందుకు ఎమ్మెల్యే అభ్యర్థితో పాటు ఆ నియోజకవర్గంలో ఎన్నికల పరిశీలకులుగా కొంతమందిని వైసిపి అధిష్టానం గురువారం నియమించింది. విశాఖ దక్షిణ నియోజకవర్గంలో టికెట్ దక్కని స్వర్గీయ ద్రోణంరాజు శ్రీనివాస్ కుమారుడు ద్రోణంరాజు శ్రీవత్సవను పరిశీలికలుగా నియమించారు. ఉత్తర నియోజకవర్గంలో ఎప్పటినుండో ఎమ్మెల్యే టికెట్ల కోసం ఆశిస్తున్న చొక్కాకుల వెంకట్రావు ను, వైసిపి జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస్ పరిశీలకులుగా నియమించేశారు. పశ్చిమ నియోజకవర్గంకు మాజీ ఎమ్మెల్యే ఎస్ ఏ రెహమాన్ ను, మహిళా నేతలు పీల ఉమారాణి, పేడాడ రమణ కుమారిని పరిశీలకులుగా నియమించారు.

ముస్లిం కోటాలో ఎప్పటినుంచో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టికెట్ కోసం ఆశిస్తున్న సీనియర్ నేతగా ఉన్న ఐ హెచ్ ఫరూకీ ని గాజువాక నియోజకవర్గం పరిశీలకులుగా నియమించి బుజ్జగించే పనిలో వైసీపీ అధిష్టానం చేసిందని తెలుస్తుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు శాసనసభ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకునుగా విశాఖపట్నం జిల్లా భీమిలి అసంబ్లీ నియోజకవర్గం నకు చెందిన కాకర్లపూడి శ్రీకాంత్ రాజును నియమించారు. ఎన్నికల సమయంలో ప్రతి అసంతృప్తి నేతకు ఏదో ఒక బాధ్యత అప్పగించి వారి సేవలు ద్వారా మళ్ళీ గెలుపే లక్ష్యంగా పని చేయించుకోవాలని తాజాగా నియోజకవర్గ పరిశీలకులు నియమకాలు జరిగినట్లు తెలుస్తుంది.

ఆరోగ్య కేంద్రాల్లో వ్యాధి నిరోధిక టీకా బృందాలు తనిఖీ

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఢిల్లీ నుండి కేంద్ర వ్యాధి నిరోధక టీకాల బృందం డా.మోనా చోప్రా అధ్వర్యంలో 5 గురు సభ్యుల బృందం విశాఖపట్నం జిల్లాలో పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లో వ్యాధి నిరోధక టీకాల అమలు తీరు, ఏ విధంగా జరుగుతుందో పర్యవేక్షించి తగు సలహాలు, సూచనలు చేశారు. ఈ బృందం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ని కలిసి తమ యొక్క పర్యటన వివరాలు తెలియజేశారు. గురువారం కొన్ని పట్టణ / ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఏ ఎన్ ఎం , ఆశా కార్యకర్త వారి యొక్క వాక్సినేషన్ అమలు చేయు తీరు, రిపోర్టు, రికార్డు, ఐ ఈ సీ మెటీరియల్ మీద అడిగి తెలుసుకుని పలు సలహాలు, సూచనలు చేసిరి. చివరిలో అనగా ఈ రోజు డా.పి.జగదీశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, విశాఖపట్నం వారితో జిల్లా వ్యాది నిరోధక టీకాల అధికారి డా.ఎస్.జీవన రాణి వారితో పలు విషయాలపై చర్చించి సలహాలు, సూచనలు చేసారు. జిల్లాలో వ్యాది నిరోధక టీకాల కార్యక్రమంపై సంతృప్తి వ్యక్తం చేసారు. డా.పి.జగదీశ్వర రావు వారు మాట్లాడుతూ టీం యొక్క ఫీడ్ బ్యాక్ పాయింట్స్ తెలియజేశారు. సమావేశంలో బి.నాగేశ్వర రావు, డెమో, మురళీకృష్ణ.ఎస్ఓ, శశిభూషణం, బి.రమేష్, అకౌంట్స్ అధికారి , నాగభూషణం, పాల్గొన్నారు.

కోడూరుకు శోభన్ బాబు స్మారక పురస్కారం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: నట భూషణ్ శోభన్ బాబు 16వ వర్ధంతిని పురస్కరించుకొని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం సాయంత్రం ద్వారకానగర్ విశాఖ పౌర గ్రంథాలయంలో శోభన్ బాబు చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి జరిగింది. ఇందులో ఫణి భూషణ్, సుజాత పాడిన నన్ను ఎవరో తాకిరి, బొమ్మిడి సత్యనారాయణ, జ్యోతి పాడిన చిలకమ్మా పలికింది, రామ నరసింహం, ఇందిరా సాహిణి పాడిన పిలిచే వారుంటే, బాబ్జి, దేవీ మధు ప్రియ పాడిన కనుల ముందు నీవుంటే, ఎమ్మెస్ మాధవ్, ఇదే పాటా ప్రతీ చోట వంటి ప్రజాదరణ పొందిన గీతాలు శ్రావ్యంగా ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి గా ఉపకార్ సేవా ట్రస్ట్ చైర్మన్, సినీ నిర్మాత డా. కంచర్ల అచ్యుతరావు హాజరైన శోభన్ బాబు అభిమాని కోడూరు కనక రాజు కు శోభన్ బాబు ఆత్మీయ పురస్కారంతో ఘనంగా సత్కరించారు. కార్యక్ర మంలో విజయ నిర్మాణ్ సంస్థ చైర్మన్ ఎస్.విజయ్ కుమార్, మానవహక్కుల కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్, సంస్థ గౌరవాధ్యక్షులు కొణతాల రాజు, నిర్వాహకుడు చెన్నా తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

నేవెల్ డాక్ యార్డ్‌లో ఇంటర్న్ షిప్ పూర్తి చేసిన ఏయూ విద్యార్థులు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం చెందిన పలువురు ఇంజనీరింగ్ విద్యార్థులు నావల్ డాక్ యార్డ్ లో ఇంటర్ షిప్ ప్రోగ్రామ్ పూర్తి చేశారు. ఫిబ్రవరి 14 నుంచి మార్చి 16 వరకు ఏయూ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 12 మంది విద్యార్థులు ఈ ఇంటెన్షిప్ కార్యక్రమంలో భాగస్వాములు అయ్యారు. ఇంటెన్షిప్ లో భాగంగా విద్యార్థులకు ప్రాక్టికల్ శిక్షణతో పాటు వివిధ ఇంజనీరింగ్ విధానాలపై అవగాహన కల్పించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కమడోర్ సంజయ్ కుమార్ ,జనరల్ మేనేజర్ (హెచ్ ఆర్) సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. భవిష్యత్తులో సైతం ఆంధ్ర ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులకు అవసరమైన ఇంటర్న్ షిప్ అందిస్తామని చెప్పారు. ఇంజనీరింగ్ కళాశాల ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన శ్రీ రామ్ ఫణీంద్ర శ్రీ సాయి బెస్ట్ ఇంటర్న్‌గా ఎంపికై ప్రత్యేకంగా ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు ఆచార్య వి. మల్లికార్జునరావు ఆచార్య కే.రాంజీ ఆచార్య ప్రసాద్, కోర్సు సమన్వయకర్త ఆచార్య గిరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.